సాక్షి
వికారాబాద్
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



అర్హులందరికీ రుణమాఫీ

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలు చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



వేరుశనగ సాగుకు సిద్ధం

చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో వేరుశనగ పంట సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. 8లో▸



క్రీడా ప్రాంగణం..

గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. 9లో▸

మళ్లీ తెరపైకి డిజిటల్

2015లో అన్ని స్కూళ్లకు కంప్యూటర్ పరికరాలు

- అదే ఏడాది డిజిటల్ తరగతులు ప్రారంభం
- మూడు నెలలకే మూలకు..
- తాజాగా తెరపైకి తెచ్చిన ప్రభుత్వం
- ఇటీవల బడులను డిజిటలైజ్ చేయాలని కేంద్రం నిర్ణయం
- ఇంకా ప్రారంభం కాని ప్రక్రియ



వికారాబాద్: పాఠశాల విద్యలోనూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతో ప్రారంభించిన డిజిటల్ తరగతులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణను గాలికొదిలేయడంలో డిజిటల్ పుస్తకాన్ని అప్పుడే మూసేశారు. 2015 – 16 విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు అప్పటి ప్రభుత్వం డిజిటల్ పరికరాలను సరఫరా చేసింది. ఇందుకోసం ఒక్కో పాఠశాలకు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఆ విద్యా సంవత్సరం ముగిసే లోపే సగం స్కూళ్లలో పరికరాలు పాడయ్యాయి. దీంతో డిజిటల్ బోధన మూలకు చేరింది. 2017 – 18 విద్యా సంవత్సరంలో పాఠశాల బోధనకు ఓ విధానం రూపొందించారు. గతంలో ఇచ్చిన కంప్యూటర్ల సామర్థ్యం తక్కువగా ఉండటం.. డిజిటల్ తరగతుల కోసం ఇచ్చిన మోడం సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో బోధన సాధ్యం కాలేదు. దీంతో పరికరాలు మళ్లీ మూలకు చేరాయి. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో బడులను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు ఇప్పటికే డిజిటల్ పరికరాలు సరఫరా చేసినందున వాటినే వినియోగిస్తారా.. లేక మూలకు పడేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

2018లో 112 పాఠశాలల్లో..

2018 విద్యా సంవత్సరం డిజిటల్ పరికరాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి మళ్లీ తరగతులను ప్రారంభించారు. జిల్లాలో జెడ్పీహెచ్ఎస్‌లు, కస్తూర్బా పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు కలిపి 185 ఉండగా అందులో 78 జెడ్పీహెచ్ఎస్‌లు,17కేజీబీవీలు, 9 మోడల్ స్కూళ్లు, 8 రెసిడెన్షియల్ స్కూళ్లలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఆరు నెలల తరువాత మిగతా స్కూళ్లకు కూడా విస్తరించారు. నాలుగేళ్ల క్రితం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకూ ప్రభుత్వం కంప్యూటర్ పరికరాలు సరఫరా చేసింది. తర్వాత ఏడాది కస్తూర్బా, మోడల్, రెసిడెన్షియల్ స్కూళ్లకు పరికరాలు సరఫరా చేశారు. దీంతో జిల్లా మొత్తం డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ప్రభుత్వ శ్రమ, నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారటానికి ఎక్కువగా రోజులు పట్టలేదు.

పర్యవేక్షణ లోపంతోనే ..

2018–19 విద్యా సంవత్సరంలో అన్ని ఉన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు సరఫరా చేశారు. తరగతులను సైతం ప్రారంభించారు. డిజిటల్ తరగతులు రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లు తయారు చేసి బోధించినవి కావడం తోపాటు ఆసక్తి కరమైన బొమ్మల ఆధారంగా బోధన జరగనుండటం, విద్యార్థులు సులువుగా నేర్చుకునేందుకు వీలు పడేలా రూపొందించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో పాఠశాలలకు వచ్చిన ప్రాజెక్టర్లు, స్క్రీన్‌లు నిరుపయోగంగా మారాయి. లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన పరికరాలు ఏడాది తిరక్కుండానే మూలకు పడటంపై పలు విమర్శలకు తావిస్తోంది. మౌలిక సదుపాయాల పేరుతో నానా యాగి చేసే ఉపాధ్యాయులు విలువైన పరికరాలను కాపాడుకోలేక పోయారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వివక్ష లేని సమాజానికి కృషి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- కలెక్టరేట్‌లో నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం
- పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజల్లో సమానత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన జరిగింది. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులకు సంబంధించిన విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. నేర ప్రవృత్తి, వివక్షకు తావులేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అత్యాచార కేసులకు సంబంధించి పోలీస్ ఉన్నతాధికారుల సహకారం తీసుకుంటూ సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డీవీఎంసీ సభ్యులకు సూచించారు. దళితులు ఎలాంటి వివక్షకు గురికాకుండా, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఎస్సీ ఎస్టీ అత్యాచార చట్టం ప్రాముఖ్యతను కళాబృందాల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం సత్వరం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో కేసుల సంఖ్య తగ్గేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి డీవీఎంసీ సమావేశాలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి, సమస్యల పరిష్కారానికి పోలీస్, రెవెన్యూ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎస్పీ కె నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు మల్లేశం, ఉపేందర్, కమలాకర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకన్న, డీఎస్‌ఓ మోహన్‌బాబు, కమిటీ సభ్యులు అనంతయ్య, జగదీష్, దస్తప్ప, కిరణ్ రోనాల్డ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, డీవీఎంసీ సభ్యులు

న్యూస్‌రీల్

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తాండూరు టౌన్: పట్టణంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాస్ కోరారు. శనివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని కార్మిక, కర్షక, రైతు, బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉన్నా యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. మండలానికి ఒక ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేసి యువతకు వృత్తివిద్య, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అందజేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు.

అర్హులకు ఆరు గ్యారంటీలు

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



మహిళకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ మంజూరు పత్రం అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్ రూరల్: ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన వారికి ఆరు గ్యారంటీలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 2వ చౌకధరల దుకాణం వద్ద మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హులైన మహిళలకు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులకు ఆరు గ్యారంటీలు అందుతాయన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తారని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వంట గ్యాస్ సిలిండర్, రెండు వందల యూనిట్లలోపు వారికి ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం



పరిగిలోని జంతు జనన నియంత్రణ కేంద్రం వద్ద అధికారులు

పరిగి: మున్సిపాలిటీల్లో కుక్కల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం తెలిపారు. శనివారం పరిగి పట్టణంలోని జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వార్డుల వారీగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. శునకాలను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్



రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

పెద్దేముల్: ధరణి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ఆదేశించారు. శనివారం పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి రిజిస్టర్, రికార్డుల గదిని పరిశీలించారు. భూ రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు.

ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎస్‌ల వారీగా నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉంటే ఏ స్థాయి ఉన్నాయి అనేదానిపై ఆరా తీశారు. డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాత నేరుస్తులు, రౌడీ షీటర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భారత్‌లో ఉగ్ర దాడులను

కళ్లకు కట్టిన సాయిసంపత్

- జెనీవాలో ఫొటో ఎగ్జిబిషన్
- దాడుల్లో బలైన భారత పౌరులు, కుటుంబాల స్థితిగతుల చిత్రాల ప్రదర్శన
- టెర్రరిస్టులపై కఠిన చర్యలకు ఐరాసలో శాశ్వత సభ్యదేశాలకు సూచన
- వీటో అధికారాన్ని ఉపయోగించాలని విజ్ఞప్తి



ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న దౌత్యవేత్తలు

బషీరాబాద్: నాలుగు దశాబ్దాలుగా ఉగ్రవాదుల దాడుల్లో బలైన భారత పౌరులు, బాధిత కుటుంబ సభ్యుల ఫొటోలను తెలంగాణ యువకుడు సాయి సంపత్ జెనీవాలోని ఐక్యరాజ్యసమితి ఆవరణలో ప్రదర్శించారు. ఈ నెల 20న ఏర్పాటు చేసిన ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను అక్కడి మీడియాలో ప్రధానంగా ప్రచురించింది. దీంతో వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం బాద్లాపూర్‌కు చెందిన సాయిసంపత్ అంతర్జాతీయ స్థాయి వార్తల్లో వ్యక్తిగా నిలిచాడు. తెలంగాణలో ఈకో ఫాన్ ఎన్‌జీఓ వ్యవస్థాపకుడైన ఈయన గతంలో పలుమార్లు అంతర్జాతీయ వేదికలపై భారత్ తరఫున వివిధ అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో శుక్రవారం జెనీవాలోని యునైటెడ్ నేషన్స్ బ్రోకెన్ చెయిర్ దగ్గర ఉగ్రవాదుల దాడులతో ప్రాణాలు కోల్పోయిన వారి ఫొటోలను, ప్రస్తుత వారి కుటుంబ సభ్యుల దీన స్థితిగతులను వివరిస్తూ ప్రపంచ దేశాల కళ్లకు కట్టారు. ఈ ప్రదర్శనకు జెనీవాలో మంచి స్పందన వచ్చింది. అంతర్జాతీయ మీడియా సైతం ప్రాధాన్యం ఇవ్వడంతో సాయిసంపత్ పేరు మరోసారి చర్చకు వచ్చింది. ఉగ్రవాదం వల్ల మానవాళిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని సాయిసంపత్ అభిప్రాయ పడ్డారు. టెర్రరిస్టులు దాడులు చేసి యథేచ్ఛగా తప్పించుకొని ఇతర దేశాలకు పారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై ఐక్యరాజ్యసమితీలో వీటో సభ్య దేశాలు కఠిన చర్యలు తీసుకునేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శన ద్వారా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గట్టిపోరాటం అవసరమని, బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని ప్రపంచానికి తెలియజేయడమే తన లక్ష్యమన్నారు. ప్రదర్శనలో ప్రపంచ దేశాల దౌత్యవేత్తలు, అంతర్జాతీయ మీడియా పాల్గొంది.



జెనీవాలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్

దసరాలోపు ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- తాండూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ



పెద్దేముల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: దసరా పండుగలోపు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన పత్రాలను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలు వంచనకు గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంపు, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటివి అమలు చేసినట్లు తెలిపారు. దసరా పండుగలోపు ఇందిరమ్మ ఇళ్లతోపాటు రేషన్‌కార్డులు కూడా అందజేస్తామన్నారు. ఆ తర్వాత మహిళలకు ప్రతి నెలా రూ.2,500 నగదు అందజేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. తనను గెలిపించిన తాండూరు ప్రజలకు రుణపడి ఉండి ఈ ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు ధారాసింగ్, ఉత్తమ్‌చందు, వడ్డె శ్రీను, శరణు బసప్ప, రాందాస్, రాము, హరిశ్వర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

తాండూరు: పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో రూ.20 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీలో కాలువలు అధ్వానంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండస్వప్న, కౌన్సిలర్లు వెంకటేష్ గౌడ్, రవిరాజ్, రామకృష్ణ, నీరజ, రత్నమాల, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ఎంపీటీ ఫంక్షన్ హాల్‌లో మహిళలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పత్రాలు అందజేశారు.

దళారీలు లేకుండా పథకాలు

పెద్దేముల్: 'మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వచ్చేసింది.. ఇక పేదలకు ఇండ్లు, రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాలు అందుతాయి' అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్‌లో సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు రూ.110 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. తాండూరు నియోజకవర్గంలో సుమారు రూ.25 కోట్ల విలువ చేసే పెండింగ్ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. రుణమాఫీ కాని వారు అధైర్య పడొద్దని, రైతులందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉన్న రూ.5 లక్షల ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి రూ.10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ జర్నప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, కోట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ అంజయ్య, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శోభారాణి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సింలు, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, ఎంపీఓ రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్కయ్య



యాలాల: కేవీపీఎస్(కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా యాలాల మండల కేంద్రానికి చెందిన ఉప్పలి మల్కయ్య ఎన్నికయ్యారు. శనివారం వికారాబాద్‌లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ.. జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై పోరాటం చేస్తామన్నారు. దళితుల సమస్యలపై రాజీలేని పోరాటానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

పోషక లోపాన్ని అధిగమిద్దాం



మాట్లాడుతున్న కృష్ణవేణి

మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి

అనంతగిరి: తీవ్ర, అతి తీవ్ర పోషక లోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక ఆహారం, బాలామృతం ప్లస్ అందజేసి వారి సరైన ఎదుగుదలకు కృషి చేద్దామని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం మాతాశిశు సంరక్షణ, పిల్లల పోషణ, పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం అనే అంశాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా గుర్తించిన తీవ్ర, అతి తీవ్ర పోషక లోపం ఉన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువు, రక్తహీనత సమస్య నివారించడానికి ప్రత్యేక ఆహారం, బాలామృతం ప్లస్ అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణలో తెలుసుకున్న వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న పౌష్టికాహార కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అనంతరం శిక్షకులు నరసింహారావు, ప్రశాంతి మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీఓలు కాంతారావు, ప్రవీణ, మెహరున్నీసా, వైద్యాధికారులు జహిరొద్దీన్, రాములు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆర్ఎంఎస్‌ఏ సిబ్బంది, పోషణ్ అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ కమిటీ నియామకం


విజయభాస్కర్‌రెడ్డి, చైర్మన్


అశోక్‌ముదిరాజ్, వైస్ చైర్మన్

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ చైర్మెన్‌గా కేరెళ్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన లింగన్‌పల్లి అశోక్‌ముదిరాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరితో పాటు మరో 16 మంది డైరెక్టర్లను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ ప్రిన్సిపల్ కోఆపరేటివ్ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. ఈ పత్రులు శనివారం ధారూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధమ్మకు అందాయి. నియమితులైన వారు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. డైరెక్టర్లుగా పటేల్ అమరేశ్వర్‌రావు, ఎస్.రవీందర్‌రెడ్డి, వరోత్య బాబునాయక్, మహ్మద్ షమీమ్ పాషా, ఎల్లంకొండి అంజయ్య, గాజుల వాణి, పి.ప్రతాప్, ఎం.జైపాల్, జోగు శోభ, కె.రవీందర్, టి.రమేశ్, బి.సాయన్న, ధారూరు పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, తాండూర్ ఏడీఏ, ధారూరు గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

అథ్లెటిక్స్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక


సాయిశ్రీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామానికి చెందిన కొనింటి సురేష్, స్వాతిలు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరి కూతురు సాయిశ్రీ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొని ప్రతిభ చూపారు. ఇందులో హైజంప్, లాంగ్ జంప్, రన్నింగ్‌లలో ఆమె గోల్డ్ మెడల్ సాధించింది. అక్టోబర్ నెల 19, 20, 21వ తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆమె ఎంపిక అయింది. గౌతపూర్ చెందిన విద్యార్థిని క్రీడాల్లో రాణించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 24 సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నియామకం ఉంటుందన్నారు.

వేరుశనగ సాగుకు సిద్ధం


ఈర్లపల్లిలో పొలాన్ని సిద్ధం చేసిన ఓ రైతు


వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేస్తున్న ఈర్లపల్లి రైతులు

దుక్కులు దున్ని చదును చేసిన అన్నదాతలు

- విత్తనాలు అందుబాటులో లేక అవస్థలు
- సబ్సిడీ విత్తనాలు ఊసెత్తని సర్కారు

దుద్యాల్: చెరువులు, కుంటలు ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు పెరగడంతో వ్యవసాయ బోర్లు పుష్కలంగా నీటిని పోస్తున్నాయి. దీంతో రైతుకు రబీ పంటలపై ఆశలు పెరిగాయి. సాగు చేసేందుకు పొలాలను చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. రబీలో అధికంగా సాగు చేసే పంట వేరుశనగ. అన్నదాతలు వీటి విత్తనాలను పొలాల్లో విత్తేందుకు ఇప్పటికే పొలాలను చదును చేసుకుని సిద్ధంగా ఉంచుకున్నారు. ప్రస్తుతం ఉత్తెర కార్తి కావడంతో వర్షం కురిస్తే పంట బాగా పండుతుందనే నమ్మకంతో రైతన్న ఎదురు చూస్తున్నారు. వేరుశనగ విత్తనాల ఎంపిక విషయంలో కర్షకులు చాలా జాగ్రతలు తీసుకుంటున్నారు.

ధరలు అధికం

పంటకు ఎలాంటి నష్టం చేయని విత్తన రకాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా పూర్తి వివరాలు తెలుసుకుని కొనుగోళ్లు చేస్తున్నారు. సొంత ఆలోచనతో గాని, వేరే రైతుల అభిప్రాయాలపై ఆధారపడడం లేదు. విత్తనాలు వేసిన తర్వాత పంటలకు తెగుళ్లు రాకుండా ఉండే అనువైన రకాల కొరకు రైతులు వెతుకుతున్నారు. స్థానికంగా వేరుశనగ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో మండలానికి చెందిన రైతులు పరిగి, వికారాబాద్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, బాదేపల్లి, గద్వాల్, పెబ్బేరు వంటి మార్కెట్లకు క్యూ కట్టారు. అక్కడ వేరుశనగ విత్తనాలు క్వింటాల్‌కు రూ.12,500 నుంచి 14,000 వరకు పలుకుతుందని రైతులు వాపోతున్నారు. ధర ఆందోళన కలిగించినా సాగుకు మాత్రం అన్నదాతలు జై కొడుతున్నారు.

సబ్సిడీ విత్తనాల ఊసేలేదు

గతంలో రైతులకు వేరుశనగ పంటకు సంబంధించిన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా చాలా తక్కువ ధరకే రైతులకు అందిస్తుండేది. ప్రస్తుతం సబ్సిడీ విత్తనాల పంపిణీ ఊసే ప్రభుత్వం ఎత్తడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ విత్తనాలను సబ్సిడీకి ప్రభుత్వం అందుబాటులో ఉంచితే రైతులకు కొంత ఊరట కలిగేదని అభిప్రాయ పడుతున్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



నాకున్న మామిడి తోటలో అంతర పంటగా వేరుశనగను ఏటా సాగు చేస్తాను. దుద్యాల్, కొడంగల్, కోస్గి, తాండూరు వంటి పట్టణాలలో విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో పరిగి, బాదెపల్లి, మహబూబ్‌నగర్‌లకు వెళ్లి పరిశీలిస్తున్నాను. అనువైన విత్తన రకం కోసం వారం రోజులుగా ఇతర పట్టణాలకు తిరుగుతున్నాను. ధరలు కూడా అధికంగా చెబుతున్నారు. విత్తనాల అమ్మకాల్లో వ్యాపారులు కుమ్మక్కై అధిక ధరలకు విచ్చిస్తున్నారు. ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా విత్తనాలు అందించాలి.

– ఈరప్ప, రైతు, హస్నాబాద్

పెరుగుతున్న పెసర ధర

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో వారం వారం పెసర ధరలు పెరుగుతూ వస్తున్నారు. మొదటి వారం క్వింటాల్‌కు రూ.7,300, రెండో వారం రూ.7,600 ఉండగా ఈ వారం క్వింటాల్‌కు రూ.8,300 ధర పలికింది. కాగా ప్రభుత్వ నిర్ణీత ధర క్వింటాల్‌కు రూ.8,550 ఉందని, వ్యాపారులు ఇంకా ధరను పెంచాల్సి ఉందని రైతులు తెలిపారు. కాగా ఈ వారం మార్కెట్‌కు 88 సంచుల పెసర వచ్చిందని, క్వింటాల్‌కు రూ.7,000, రూ.7,500 రూ.8,300 వరకు పెసర నాణ్యతను బట్టి ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. అలాగే ఈ వారం మినుములు 10 సంచులు మార్కెట్‌కు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.3,500, రూ.4,000, రూ.4,600 వరకు కొనుగోలు చేశారని ఆమె వివరించారు. మినుములు భారీ వర్షాలకు దెబ్బతిందని, దీంతో నాణ్యత కొంత లోపించిందని తెలిపారు.

కురిసిన వాన.. పంటకు పోషణ

పెద్దేముల్: వరుణుడు కరుణించడంతో పంటలకు జీవం అందింది. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పంటలకు ప్రాణం వచ్చినట్లుగా ఉందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల నుంచి పత్తి, కందితో పాటు ఇతర పంటలు ఎండలకు వాడిపోతున్నాయి. బోర్లు, బావులు ఉన్న కొంత మంది రైతులు మాత్రమే పంటలకు నీరు అందిస్తున్నారు. వరుణుడు కరుణించడం వరంగా మారిందని మండలంలోని నాగులపల్లి, మారేపల్లి, తట్టెపల్లి, పెద్దేముల్, గాజీపూర్, మంబాపూర్, కందనెల్లి, ఇందూరుతో పాటు పలు గ్రామాల రైతులు సంబర పడుతున్నారు. మండలంలో సుమారు 80 శాతం పత్తి, కంది పంటలు అధికంగా సాగవుతున్నాయి.


పెద్దేముల్‌లో సాగవుతున్న పత్తి పంట


గుంతలమయంగా మారిన పరిగి-షాద్‌నగర్ రోడ్డు

ప్రయాణం.. నరకప్రాయం

పరిగి: ప్రయాణం అంటేనే నరకయాతనగా మారింది. ఆ రూట్‌లో రావాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్డుతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పట్టణ కేంద్రం కొడంగల్ చౌరస్తా నుంచి షాద్‌నగర్ వెళ్లే రోడ్డు సయ్యాద్‌మల్కాపూర్ వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాలకు దారితీస్తుంది. గత ప్రభుత్వం రోడ్డు వేయాలని కాంగ్రెస్ నాయకులు ధర్నాలు చేసినా రోడ్డు వేసిన దాఖలాలు లేవు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా పట్టణవాసులు రోడ్డు బాగవుతుందని ఆశపడ్డ వారి ఆశలు అడియాశలవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసినా నాయకులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం: కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోత్కుపల్లికి చెందిన బేగరి నర్సింలు(42) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉండే వాడు. ఇటీవల గ్రామానికి తిరిగి వచ్చాడు. కుటుంబ కలహాలతో భార్య హేమలత పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

కుల్కచర్ల: టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసిన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి సమయంలో శ్మశాన వాటికలో కొందరు పేకాట ఆడుతుండగా టాస్క్‌ఫోర్స్, పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇందులో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.7,600, ఆరు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

కొడంగల్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా అండర్ 17, అండర్ 14 విద్యార్థినీ విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ క్రీడా పోటీలను ప్రారంభిస్తూ విద్యార్థులకు సూచనలు అందించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, క్రమశిక్షణ పట్టుదలతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాలకు చెందిన 46బాలుర జట్లు, 43బాలికల జట్లు పాల్గొన్నాయని, ఇందులో 13వందల మంది విద్యార్థులు పాల్గొన్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఏసురత్నం, ఎఫ్.నర్సింలు, ఆనంద్‌రావు, వెంకటేష్, కరుణాకర్, గోపీనాథ్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

మర్పల్లి: గుర్తు తెలియని మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్లూర్‌కు చెందిన చామంతి బలరామరాజు వ్యవసాయ పొలంలో.. నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పొలంలో పశువులు మేపుతుండగా కుళ్లిపోయిన స్థితిలో అస్థిపంజరమైన శవం కనిపించింది. దీంతో వెంటనే స్థానిక నాయకులతో కలిసి మర్పల్లి పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని, పంచనామా నిర్వహించారు. అనంతరం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మార్చురీలో భద్రపర్చారు. గ్రామంలో, మండలంలో మిస్సింగ్‌లపై ఆరా తీయడంతో పాటు కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కళ్లెదుటే నీటమునిగి

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


వెంకటయ్య (ఫైల్)

నవాబుపేట: కట్టుకున్నోడు కళ్లెదుటే దుర్మరణం చెందడంతో ఆ మహిళ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లకొండ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి వెంకటయ్య(48) వ్యవసాయ కూలీ. శుక్రవారం సాయంత్రం ఆయన గ్రామంలో ఓ అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తూ గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు స్నానం చేయడానికి భార్య పార్వతమ్మతో వెళ్లారు. బావిలోకి దిగిన ఆయన బట్టలు ఉతికి పైన ఉన్న భార్యకు ఇచ్చి ఆరా పెట్టమన్నారు. దాంతో ఆమె బట్టలను తీసుకొని ఆరపెడుతుంది. వెంకటయ్య బావి మెట్ల మీద ఉండి స్నానం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి నీళ్లలో పడ్డారు. గమనించిన భార్య కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వాళ్లు వచ్చి చూడగా అప్పటికే ఆయన పూర్తిగా మునిగిపోయారు. బావిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో మోటార్లు పెట్టి నీళ్లను తోడేసి మృతదేహన్ని బయటకు తీశారు. మృతదేహనికి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

సమాజంలో గురువులకు ఉన్నత స్థానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

యాలాల: సమాజంలో ఉన్నత స్థానం ఉపాధ్యాయులదేనని తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ హాలులో విద్యాశాఖ తరపున నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, ఎంపీడీఓ పుష్పలీల, మాజీ వైస్ ఎంపీపీ అనంతయ్య, పీఆర్‌టీయూ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మొగులయ్య, మురహరినాథ్ ఉన్నారు.

కల్లం తొక్కిన ఎద్దుల బంతి!

ఒకప్పుడు ఎద్దు లేనిదే ఎవుసం లేదు అనేలా ఉండేది. కానీ ప్రస్తుతం వ్యవసాయంలో అన్ని పనులను మిషన్లతోనే చేస్తున్నారు. యాంత్రీకరణ పెరగడంతో సాగులో ఎద్దుల ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. అతివృష్టి, అనావృష్టి కారణంగా సాకడం భారమై చాలా మంది రైతులు పశుపోషణను తగ్గించేశారు. దీనికి తోడు యంత్రాలతో చేస్తున్న పని తక్కువ సమయంలో పూర్తవుతుండటంతో అటువైపే మొగ్గు చూపుతున్నారు. జొన్న కంకులను ఎద్దులతో తొక్కిస్తూ.. నూర్పిడి చేస్తున్న ఈ దృశ్యం శనివారం చెట్టుపల్లితండాలో 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

– దుద్యాల్


ఎద్దులతో బంతి తిప్పుతున్న రైతు

అర్హులందరికీ రుణమాఫీ పక్కా

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: అర్హులైన వారందరికీ రూ.రెండు లక్షల లోపు రుణమాఫీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులతో రుణమాఫీ కాని రైతులకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. కొన్ని సందర్భాల్లో సాంకేతిక లోపంతో మాఫీ జరగలేదన్నారు. అలాంటి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందరాదని భరోసా కల్పించారు. మండలానికి ఇప్పటి వరకు రూ.30 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని త్వరలో మిగతా వారికి మాఫీ జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కాగా అందించాలని సూచించారు. అనంతరం 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ పాండు, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, బ్యాంకు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సరి చేసుకోండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తోందని, అర్హులు పేర్లు, ఫోన్ నెంబర్లు సరి చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్పీజీ వినియోగదారుల వివరాల తప్పులను సవరించాల్సింది సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. వినియోగదారుల పేర్లు, ఫోన్ నంబర్లు తప్పుగా ఉంటే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ తీసుకెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారికి విన్నవించిన ఏఈఓలు
- లేదంటే 27నుంచి ఆందోళన చేపడుతామని వెల్లడి

ఇబ్రహీంపట్నం రూరల్: క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను పరిష్కరించాలని ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాలాల శ్రావన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ శశాంక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంతోపాటు, రైతులకు సేవలందిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 5 నుంచి 6 రెవెన్యూ గ్రామాలు, 6,500 ఎకరాల సాగు భూములకు ఒక్క ఏఈఓ మాత్రమే ఉన్నారని తెలిపారు. దీంతో పని భారం అధికమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గ్రామానికి సహాయకుడిని నియమించాలని కోరారు. గతంలోనే తాము పేర్కొన్న సమస్యలన్నింటినీ ఈనెల 26లోపు పరిష్కరించాలని, లేదంటే 27నుంచి ఆందోళన కార్యక్రమాలకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రవణ్‌కుమార్, శివాని, రాజేశ్వరి, గౌరిప్రియ, శ్రీయన, రాజు, శ్రీహరి, గీత, అభినవ్, అనూష, వాహిని, శ్రీనాథ్‌రెడ్డి, రమేశ్, ప్రియాంక, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులను నియమించాలి


జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఏఈఓల సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: ఏఈఓలపై పని భారం పెరుగుతున్నందున గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలి ఏఈఓల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏడేళ్లుగా ఏఈఓల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఏఈఓకు 6,500ఎకరాల నుండి 9వేల ఎకరాల సాగుభూమికి సంబంధించిన వివిధ పనులను చేయాల్సి ఉంటుందని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, పీఎం కిసాన్, పంట వివరాల నమోదు, పంట నష్టం అంచనా వేయడం తదితర 49 రకాల పనులను చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం వివిధ శాఖలలో చేపడుతున్న కార్యక్రమాలను సమయానుసారంగా ప్రత్యేక అధికారులుగా ఏఈఓలు సేవలందిస్తూ తలకు మించిన భారం మోస్తున్నామని పేర్కొన్నారు. వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలి కోరారు. కార్యక్రమంలో ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఐజాక్ హోరాల్డ్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, అసోసియేట్ కార్యదర్శి మశ్చందర్, కోశాధికారి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.